


# - 185 -


## అమెరికా యోగా కథ... రెండో భాగం

**కెవ్వు కేక...**

అలాంటి ఆర్తితో కేవలం నా కోసమే, నన్ను అల్లరి చెయ్యడం కోసమే మా క్వీన్ విక్టోరియా అప్పుడప్పుడు ప్రయోగించే దివ్యాస్త్రం అది. ఈ కెవ్వు కేక ఆ మధ్య ఏదో సినిమాలో వచ్చిన దేశం లో యూతు ని...ఈ దిక్కుమాలిన యూతు అనే పదం వింటేనే నాకు కంపరం ఎత్తుతుంది. కానీ యువత అంటే ఈ నాటి యూతుకి అర్ధం అయి చావదు కదా...ఆ యూతే యువత బాపతు వాళ్ళని కేక పెట్టించిన ఆనందంతో మైమరిచి పెట్టిన కెవ్వు కేక బాపతు కాదు. మా క్వీన్ విక్టోరియాది ఎక్కడో కొంప మునిగిన బాపతు అరుపు. అంటే రావణాసురుడు ఋషి వేషం లో వచ్చి తన అసలు రూపం చూపించినప్పుడు సీతా దేవి పెట్టిన కేక, అర్జునుడి బాణం గుచ్చుకున్నప్పుడు కర్ణుడు పెట్టిన కేక ..ఇలా మరొక రకం అనమాట. సాధారణంగా ఇలాంటి కెవ్వు కేకలకి సందర్భాలు తను వంటింట్లో వంకాయ బదులు తన వేలు కోసుకున్నప్పుడో, బయట తోటలో గడ్డి మొక్క పీకబోయి తోటకూర మొక్క పీకి పారేసినప్పుడో, స్నానం కోసం నీళ్ళ ఉష్ణోగ్రత ఏకంగా వెయ్యి డిగ్రీలకి పెంచినప్పుడు మా వాటర్ హీటర్ అది భరించలేక ఠకీమని చల్లటి నీళ్ళు గుమ్మరించినప్పుడూ మొదలైనవి. కానీ ఈ సారి ఈ కెవ్వు కేక కిచెన్, వంగ తోట, స్నానాల గది లలో ఎక్కడ నుంచీ కాదు. ఏకంగా మా పడక గది లోనించే....అబ్బే...అదేమీ కాదు. .నేను ఆ సమయం లో నా హోమ్ ఆఫీసు లో కథలు రాసుకుంటున్నాను. ఈ కెవ్వు కేక వినగానే రాస్తున్న కథని సస్పెన్స్ లో పెట్టి మా పడక గది లోకి పరిగెట్టాను.

అక్కడ సీన్ వర్ణనాతీతం. హాలీవుడ్ హారర్ సినిమాలలో కూడా నేను అలాంటి సీన్ చూడ లేదు. మా క్వీన్ విక్టోరియా మొత్తం శరీరం వాలకం పూర్తిగా మారిపోయింది. కుడి చెయ్యి గుండ్రంగా తిరిగి ఎడమ చెయ్యి వెనక ఇరుక్కుపోయింది. ఎడం చెయ్యికి ఏం చెయ్యాలో తెలీక చేతి వేళ్ళు యమా స్పీడు లో గిల గిలా ఆడిస్తోంది. ఇదంతా ఒక

ఎత్తు అయితే మా క్వీన్ విక్టోరియా కుడి కాలు ఉండవలసిన చోట లేనే లేదు. అది ఎలా జరిగిందో తెలీదు కానీ ఆ కాలు తన మెడ చుట్టూ బిగుసుకు పోయింది. ఎడమ కాలు ఆ వియోగం భరించ లేక కార్పెట్ మీద చతికిల పడింది. ఈ ఆకారం లో మా క్వీన్ విక్టోరియా అందమైన మొహం ఎక్కడ ఉందో అని "హనీ, ఎక్కడున్నావు?" అంటూ వెతకడం మొదలుపెట్టాను. అప్పుడు సరిగ్గా ఇందాకటి లాగా ఘాట్టిగా కాకుండా పీలగా, కీచు గొంతుకతో మళ్ళీ కెవ్వు కేక వినపడగానే అప్పుడు అటు దృష్టి సారించగా అప్పడం లా నలిగిపోయిన ఆవిడ మొహం పైన వేళ్లాడుతున్న కుడికాలు మోకాలు దగ్గర కనపడింది. ఆ కెవ్వు కేక అనంతరం "ఒరేయ్ మొగుడూ..ఈ చిక్కు ముడి విప్పు. ఇదంతా గందర గోళంగా ఉంది" అని ఆవిడ అర్ధించింది. అప్పుడు నాకు వెలిగింది. ఇదంతా ఆవిడ ఈ మధ్యనే మొదలు పెటిన యోగా క్లాసుల మహిమ.



అసలేం జరిగిందంటే...సుమారు మూడున్నర దశాబ్దాలకి పైగా అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా, రోజూ నాకు ఒక టెంకి జెల్ల బహుమానం ఇచ్చేసి రాత్రి ఉద్యోగానికి వెళ్ళి కష్టపడిన మా క్వీన్ విక్టోరియా మొత్తానికి పదవీ విరమణ చేసి పారేసింది. మాకు మనవడు పుట్టగానే ఇక కట్టుకున్న మొగుణ్ణి పక్కన పెట్టి మనవడిని చూసుకోవచ్చు కదా అని ముచ్చట పడడమే ఆవిడ రిటైర్ అవడానికి అసలు కారణం. తీరా వాడికి ఆర్నెల్లు రాగానే అమెరికా ఆచారం ప్రకారం మా అమ్మాయి, అల్లుడూ ఉద్యోగాలకీ, మా మనవడు 'డే కేర్' కీ వెళ్ళడం మొదలు పెట్టగానే మా ఆవిడ మనవడి సిట్టింగ్ ఉద్యోగం కూడా ఊడిపోయింది. దాంతో మా ఆవిడకి పని లేకుండా పోయింది. అలా అని హాయిగా ఇంటి పట్టున ఉండవచ్చు గా. తిట్టే నోరు, తిరిగే కాళ్ళు ఊరికే ఉండవు కదా...అంచేత కాలక్షేపం కోసం ఈ యోగా క్లాసు లు మొదలెట్టింది మా క్వీన్ విక్టోరియా. ఇహ చూసుకోండి. లేడికి లేచిందే పండగ. ఆవిడ యోగా మాట ఎలా ఉన్నా, అమెజాన్ వాడి యోగం దివ్యంగా ఉంది. వారం, పది రోజులు అమెజాన్ వాడు మా ఇంటి ముందు తిష్ట వేశాడు. ప్రతీ రోజూ ఏదో ఒక యోగా చాప, దిండు, నడ్డి కింద పెట్టుకునే కడ్డీలు, లూజు లూజుగా వేసుకునే పంట్లాలు, చొక్కాలు, పెద్ద బంతి,..ఇలా సకల వస్తు సముదాయం తో మా ఇల్లు నిండి పోయింది. తన యోగా కోసం వేరే గది కట్టించుకుంటాను అని ఆవిడ కేవలం 50 వేల డాలర్ల హోమ్ ఇంప్రూవ్ మెంట్ ప్రతిపాదన ని నేను తీవ్రంగా వ్యతిరేకించాను. "మరి నేను యోగా ఎక్కడ చెయ్యవలయును? వంటింట్లోనా, లివింగ్ గది లోనా, ఆరు బయట వర్షం లోనా, ఈ వస్తువులన్నీ ఎక్కడ పెట్టవలెను" అని ఆవిడ సతాయింపు మొదలెట్టగానే "ఆ మాట అయి కొనక ముందు సెప్పాల. తప్పు కాదూ" అని నేను రావు గోపాల రావు టైపు లో ఎంత గింజుకున్నా, అప్పటికే డేమేజ్ అయిపోయింది కాబట్టి మొత్తానికి మా పడక గది మాత్రమే ఆవిడ యోగా గదిగా అన్ని విధాలా యోగ్యమయినది అని రాజీ కి వచ్చాను. గత కొద్ది రోజులుగా నేను నిద్ర

పోవాలంటే ముందు మా పడక గది లో ఈ సరంజామా అంతా దాటుకుని, దారి తప్పిపోకుండా బెడ్ మీదకి చెరుకోడానికి చాలా జాగ్రత్త పడాల్సి వస్తోంది.

ఇంతకీ ఆవిడ యోగా క్లాసులు ఎక్కడో కాదు. ఎక్కడో ఎవరో స్టూడియో లో నేర్పించే యోగా క్లాసులకి వెళ్తే గూబ వాస్తుంది...గంటకి పాతిక డాలర్లు. వారానికి నాలుగు గంటలు....అంచేత ఆవిడ యోగా క్లాసులు అన్నీ టీవీ లో ఉచితంగా వచ్చేవే!. అదిగో అక్కడే వచ్చింది అసలు చిక్కంతా. యూ ట్యూబ్ లో 'యోగా" అని కొడితే కొన్ని వేల వీడియోలు వస్తాయి కదా...వాటిల్లో ఎవరి పైత్యం వాళ్ళది. ఒకరు శీర్షాసనం అయితే మరొకడు శవాసనం. ఇంకొకడు కోతి, మొసలి, పాము, దున్నపోతు ఆసనం...ఇలా...రకరకాల ఆసనాలు...అందులోనే మెడిటేషన్... అక్కడికి అది మనకి తెలియదన్నట్టు ఊపిరి తీసుకునే మార్గాలు..ఇలా సవాలక్ష.... దాంతో మా క్వీన్ విక్టోరియా వారం రోజుల పాటు వంటా, పెంటా మానేసి ఈ వీడియోలు చూడడం, అందులో ఏ పోజు తనకి కుదురుతుందో కాస్సేపు ప్రయత్నించడం...నాకు తెలియక అడుగుతానూ....అలా వీడియో లో యోగా చేసే అమ్మాయి నిట్టనిలువునా నిల్చుని, నడుం దగ్గర వంగి తన కాళ్ళ వేళ్ళు పట్టుకుని మన కేసి చూసి విలాసంగా నవ్విందే అనుకుందాం. అది మనం ప్రయత్నిస్తే ఏమవుతుంది? నవ్వు బదులు నొప్పితో ఏడుపు వస్తుంది కదా!. అలాగే నేల మీద బాసిమ్మటం వేసి కూచుని మన కాళ్ళ వేళ్ళు పట్టుకుందాం అనుకుంటే అదేమన్నా అయే పనా? అంతకీ ఆవిడ చేస్తున్న ఈ విశ్వ ప్రయత్నాలకి నేను జాలిపడి "ఓ పని చేద్దాం. కొంచెం వెరైటీ గా ఉండడం కోసం నువ్వు అలా ఆ యోగా చాప మీద బాసిమ్మటం వేసుకుని కూచో. నీ కాలి వేళ్ళు నేను పట్టుకుంటాను. అలాగే నేను నుంచుని ఉంటాను. నా కాలి వేళ్ళు నువ్వు పట్టుకో" అనగానే 'బుద్ధి లేకపోతే సరి" అని వికటాట్టహాసం చేసింది మా క్వీన్ విక్టోరియా.

ఈ యోగా ప్రాక్టీసులో పరాకాష్ట మొన్న జరిగిన ఆ దిక్కుమాలిన ఆసనం ఎక్స్ పెరిమెంట్. ఆ ఆసనం పేరు బహుశా "కాలికేస్తే మెడకీ, మెడకేస్తే కాలికీ" అయి ఉంటుంది. కానీ, ఉన్నదాన్ని ఉన్నచోట ఉండనియ్యకుండా అష్టవంకరులూ తిప్పి మన కాలు తాలూకు మోకాలు పైన ఎక్కడో ఉన్న మెడ మీద పెట్టి నానా అవస్థ పడడంలో ఉన్న ఆనందం ఏమిటో నాకు తెలీదు. అంటే అభిమన్యుడిలా పద్మవ్యూహం లోకి చొచ్చుకు పోవడమే కానీ వెనక్కి తిరిగి రావడం తెలియనట్టు, మా క్వీన్ విక్టోరియా ఆ దిక్కుమాలిన కాలుని మెడ చుట్టూ తిప్పి ముడెయ్యడమే కాని ఆ ముడి విప్పడం తెలియక ఇరుక్కు పోయినప్పుడు ఆ కెవ్వు కేక విని రక్షించడానికి పక్కన శ్రీ మహావిష్ణువులాగా నేను ఉన్నాను కాబట్టి సరిపోయింది. లేకపోతే ఆ రోజు మా ఇంట్లో వంట ఎవరు చేస్తారు?

ఈ కథలో నీతి ఏమిటంటే....ఎవరి శరీరాన్ని బట్టి వారు యోగాభ్యాసన చేసుకోవాలి కానీ పులిని చూసి నక్క వాతలు పెట్టుకోకూడదు. అసలు యోగా మాట ఎలా ఉన్నా దాన్ని రాజకీయాల కోసమూ, వ్యాపారం కోసమూ వాడుకోవడం చూసినప్పుడల్లా నాకు భలే నవ్వు వస్తుంది.

**COMMENTS**